వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
శుక్రవారం 17 ఏప్రిల్ 2026



## కూల్ పెయింట్ వేపించిన మఠాధిపతి..

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 16 ప్రభాతవార్త

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం నుంచి బస్సు షెల్టర్ వరకు,వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నుంచి వరుణ్ స్కూల్ వరకు,అలాగే మఠం ప్రాంగణంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆదేశాల మేరకు భక్తులను శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మాల ధరించిన స్వాములను దృష్టిలో ఉంచుకొని కాళ్ల కాలు తాయని కూల్ పెయింట్ ను వేపించిన మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి వారు. స్వాములవారు ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న మఠాధిపతిని దూర ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు, స్థానిక పుర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా మన్విత ఎంపిక

పులివెందుల, ఏప్రిల్ 16 , ప్రభాత వార్త :



పులివెందులకు చెందిన పేరుసోముల మన్విత ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జీఎస్టీ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాన్ని సాధించింది. ఈ సంవత్సరం నిర్వహించిన సీజీఎల్ పరీక్షల్లో ఆమె 342 మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది. కేరళలోని ఎన్ఐటీ కాలికట్‌లో బీటెక్ పూర్తి చేసిన మన్విత, పట్టుదలతో కృషి చేసి ఈ విజయాన్ని అందుకుంది. సాధారణ కుటుంబానికి చెందిన ఆమె క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాన్ని సంపాదించడం స్థానికంగా ఆదర్శంగా నిలుస్తోంది. మన్విత తల్లిదండ్రులు గంగాధర రెడ్డి, అనసూయ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్నారు. తమ కుమార్తె సాధించిన విజయంపై వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులు, స్థానిక ప్రముఖులు మన్వితకు అభినందనలు తెలియజేస్తూ, ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలు చేరాలని ఆకాంక్షించారు.

# అధికలోడుతో వెళ్తున్న కేసులుండవు

### ప్రభుత్వ ఆదాయానికి గండి
### చిన్న వాహనాలపై కేసులు
### భారీ వాహనాలకు వెసులుబాటు
### పట్టించుకోని అధికారి



బద్వేలు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :

బద్వేలు రవాణా శాఖ పరిధిలో కేసులు తక్కువైనా వసూలు మాత్రం ఎక్కువగా ఉన్నట్లు కనపడుతుంది. ఓవర్‌లోడ్‌తో పట్టణంలోకి అడుగు పెడుతున్న ప్రతి వాహనం డబ్బు ముట్టచెప్పాల్సిందే. లేకపోతే అపరాధరుసుము పేరుతో చుక్కలు చూపిస్తారు. బద్వేలు మీదుగా నిత్యం ఇసుక అధికలోడుతో వెళుతున్నా పట్టించుకునే నాథుడేలేడు. అలాగే పక్క ప్రాంతం నుంచి కంకర కూడా అధిక లోడుతో బద్వేలుకు వస్తుంది. ఇదిలా ఉంటే గోపవరం మండలం, శ్రీనివాసపురం దగ్గర ఉన్న కంకరమిల్లు వద్ద నుంచి కూడా టన్నుల కొద్ది బయటకు వెళుతున్నప్పటికీ పట్టించుకోవడంలేదు. ఆ వాహనాలపై ఎలాంటి తనిఖీలు చేయకపోగా, పొరపాటున ఎవరైనా వారి వాహనం ఆపితే వారు నెంబరు చెప్పి వెళ్లిపోతున్నట్లు తెలుస్తుంది. ప్రతి రోజూ రాత్రి 8 నుంచి 9 గంటల సమయంలో సిద్దవటం ఇసుక రీచ్ నుంచి బద్వేలు మీదుగా పోరుమామిళ్ల, ఇతర ప్రాంతాలకు అధికలోడుతో వెళ్తుంది. పెద్ద వాహనాలలో 20 నుంచి 25 టన్నులు ఇసుక వెళ్లాల్సి ఉండగా 45 టన్నులకు పైగా ఇసుక వెళ్తుంటే ఆ అధికారి పట్టించుకోవడం లేదని ప్రచారం జరుగుతోంది. వీటి వలన ఎంత ప్రమాదం ఉందో తెలిసి కూడా వాహనాలపై చర్యలు తీసుకోకుండా వాహనాలను వదిలేయడంతో జరగబోయే ప్రమాదాలకు ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడుతున్నారు. పేదవాడు పొట్ట కూటి కోసం ఆటోలో పొరపాటున కెపాసిటికి మించి ఒక ప్యాసింజర్‌ను తీసుకెళితే ఇటు పోలీసులు, అటు రవాణాశాఖాదికారులు వాహనాలు నిలిపి అపరాదరుసుము వేసి ఇబ్బంది పెట్టే అధికారులకు ఇలాంటి అధికలోడుతో వెళ్లే వాహనాలు కనపడవా? అధిక టన్నులతో ఇసుక రవాణా కావడం వలన ఇటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా రోడ్లు దెబ్బతింటున్నాయి. కోట్ల రూపాయలతో జాతీయ రహదారులు నిర్మిస్తే ఇలా అధిక టనున్నలతో వాహనాలు వెళితే రోడ్లు దెబ్బతినకుండా ఉంటాయా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు భద్రత నియమావళి ప్రకారం ప్రతి వాహనం రోడ్డుమీదకు వస్తే తగిన నిబందనల ప్రకారం వెళ్లాలి తప్ప అతిక్రమించి వెళితే వాటిని కట్టడి చేయవలసిన రవాణశాఖాధికారులు ఎవరికి చెప్పాలని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వీటి వలన జరగరాని ప్రమాదాలు జరిగినపుడు అధికారులు అపుడు చర్యలు తీసుకోవడంకన్నా, కళ్లముందు జరుగుతున్న తప్పును వెంటనే అరికడితే జరగబోయే ప్రమాదాలను నివారించడమేకాకుండా, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినట్లు కాకుండా రోడ్డు భద్రతను కూడా కాపాడే అవవకాశాలు లేకపోలేదు. ఇప్పటికే ఆ అపరాధరుసుము చెల్లించిన వ్యక్తులు కొంతమంది విలేకర్ల వద్ద తమ గోడు వెళ్లబుచ్చారు. ఇలా టన్నుల కొద్ది ఇసుక ఎక్కడ డంప్ అవుతుందో తెలియదు. ఈ ఇసుకతో పాటు కంకర కూడా అధిక లోడుతో బద్వేలులోకి వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా ఆ అధికారి పరిశీలించినట్లు సమాచారం. క్వారి నుంచి వచ్చే కంకర కూడా అధిక టన్నులతో బయటకు వెళ్తున్నా పట్టించుకోవడం లేదని, కంకర లోడు ఎక్కువ కావడంతో రోడ్ల వెంట కంకర పడుతుండడంతో అక్కడి గ్రామస్థులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం ఇసుక అయినా, కంకర అయినా సరఫరా చేస్తే తమకు వచ్చే ఆదాయం తక్కువని, ఎక్కువ సరఫరా చేయడం వలన ఎక్కువ ఆదాయం గడించవచ్చని అనుకుంటున్నారు తప్ప వాటి వలన జరగబోయే ప్రమాదాలను గుర్తించడంలేదు.

## పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



రోగి కళ్ళు పరీక్షిస్తున్న డాక్టర్ సురేంద్ర, పక్కనే జగన్మోహన్ రాజు

రాజంపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

పేదల ఆరోగ్యమే మహాభాగ్యమని, ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇం చార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. గురువారం స్థానిక ఏబి చంద్రరెడ్డి కళ్యాణ మండపంలో జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో రేడియంట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత నేత విద్య చివరానికి జనం పోటెత్తారు. సుమారు 1700మంది హాజరై నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. మొదటి విడత ఆపరేషన్లు అవసరమైన వారిని తిరుపతికి తరలించేందుకు జగన్మోహన్ రాజు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరిని జగన్ మోహన్ రాజు, ఆయన తనయుడు లోకేష్ రాజు ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి 4వ పేజీలో

## మాటల్లో స్వచ్ఛాంధ్ర ఆచరణలో మురికాంధ్ర..

వేంపల్లె లో పడకేసిన పారిశుధ్యం... డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



వేంపల్లె ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రాష్ట్రంలోనే అతిపెద్ద మేజర్ పంచాయతీ అయిన వేంపల్లె లో కూటమి పాలన లో పారిశుధ్యం పడకేసిందని, స్వచ్ఛాంధ్ర మాటల్లో తప్ప ఆచరణలో కనిపించడం లేదని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం వేంపల్లె మేజర్ పంచాయతీలో కాంగ్రెస్ నాయకులు పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ వేంపల్లె గ్రామపంచాయతీ రాష్ట్రంలోనే అతిపెద్ద మేజర్ గ్రామపంచాయతీ అని,దాదాపు 50 వేల జనాభా ఉంటుందని అన్నారు. 53 మంది పారిశుద్ధ్య సిబ్బంది,30 మంది గ్రీన్ అంబాసిడర్స్ ఉన్నారన్నారు. గత ఐదు నెలలుగా ప్రభుత్వం వీరికి జీతాలు ఇవ్వడం లేదు. 22 నెలలుగా ప్రావిడెంట్ ఫండ్ చెల్లించడం లేదు. అందువలన పారిశుద్ధ్య సిబ్బంది తమ విధులు నిర్వహించడం లేదు. మురుగునీటి కాలువలు చెత్తా చెదారంతో, ప్లాస్టిక్ వస్తువులతో పూర్తిగా పూడిపోయాయి. మురికి నీరు రోడ్లమీద ప్రవహిస్తోంది. రోడ్లమీద ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోంది. పందులు, కుక్కలు, ఆవులు, దోమలు, ఈగలు మనుషులు సహజీవనం చేయవలసి వస్తోంది . డెంగు, మలేరియా, టైఫాయిడ్ అతిసార తదితర వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రతి నెల మూడవ శనివారం మొక్కుబడిగా,తంతుగా సాగుతున్న స్వచ్ఛంద కార్యక్రమం కూడా వేంపల్లె మేజర్ పంచాయతీలో జరగడం లేదు. సంబంధిత అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకుపోయినా ప్రయోజనం లేకుండా పోయింది. సమస్య పరిష్కారం కోసం మరొకసారి అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకుపోవాలని ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టడం జరిగిందని తులసి రెడ్డి అన్నారు. వెంటనే ప్రభుత్వం పారిశుద్ధ్య సిబ్బందికి చెల్లించాల్సిన జీతాలు చెల్లించాలని,ప్రావిడెంట్ ఫండ్ ఖాతా కింద నిధులు జమ చేయాలని, పారిశుద్ధ్య సిబ్బంది చేత, గ్రీన్ అంబాసిడర్ల చేత వాళ్ళ బాధ్యతలు సక్రమంగా నిర్వహించెటట్లు చేయాలని తులసి రెడ్డి ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల అసెంబ్లీ నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మూలంరెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు బీగాల రామకృష్ణ, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు, బద్రి, రాఘవయ్య,ఐచర్ రమణ, నామా వినయ్,వేమా రాజ, గంగాధర్, బాబావల్లి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఎస్సీ ఆకస్మిక తనిఖీ

సూర్యఘర్ పథకం పనులపై సమీక్ష.. వేసవి విద్యుత్ సరఫరాపై కీలక ఆదేశాలు

పులివెందుల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :

కడప జిల్లా విద్యుత్ శాఖ నూతన సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్సీ)గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు, గురువారం పులివెందుల పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఇది ఆయన తొలి పర్యటన కావడం విశేషం. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ యూనియన్ నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక కార్యాల యంలో అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకం కింద ఎస్సీ/ఎస్టీ వినియోగదారుల ఇళ్లపై ఏర్పాటు చేస్తున్న సౌర విద్యుత్ ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించారు. పనులు వేగవంతంగా, నాణ్యతతో, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతర, నాణ్యమైన విద్యు త్ సరఫరా కోసం ముందస్తు చర్యలు తప్పనిస రిగా చేప ట్టాలని సూచించారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని, ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. పగటి పూట వీధి దీపాలు వెలగకుండా



అధికారులతో సమీక్ష సమావేశంలో సూచనలు చేస్తున్న ఎస్సీ

కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని, విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తదుపరి, పట్టణంలోని 33/11 కేవీ పులివెందుల వెస్ట్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించి, నిర్వహణపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రసన్నాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ రెడ్డి, డీఈఈలు, ఏఈలు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదానికి గురైన అరటి తోటలు



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పులివెందుల ఏప్రిల్ 16, ప్రభాతవార్త :

పులివెందుల మండలం నల్లపురెడ్డి పల్లె గ్రామ పరిధిలోని వ్యవసాయ పొలాల్లో గురువారం అరటి తోటల్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక రైతులైన ఇద్దరి పొలాల్లో మంటలు చెలరేగి కొంత మేర నష్టం వాటిల్లింది. పి. సాయి లీల (భర్త చంద్రశేఖర్)కు చెందిన రెండున్నర ఎకరాల అరటి తోటలో డ్రిప్ సిస్టమ్ కొంత భాగం కాలిపోయి సుమారు రూ.30,000 నష్టం సంభవించింది. అలాగే ఆర్. గంగరాజు (తండ్రి పెద్ద గంగయ్య)కు చెందిన ఒకటిన్నర ఎకరా అరటి తోటలో డ్రిప్ వ్యవస్థతో పాటు డ్రమ్‌లు, పోటుకట్టలు కాలిపోవడంతో సుమారు రూ.1 లక్ష మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం. అయితే అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో ఇద్దరి రైతుల పొలాల్లో కలిపి సుమారు రూ.2,70,000 విలువైన ఆస్తి రక్షించబడింది. ఈ ఘటనలో ఫైర్ ఆఫీసర్ పి. సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రవీందర్ రెడ్డి, డి. శివకుమార్, కె. మురళి, పి. సుదర్శన్ రెడ్డి, వి. హేమంత్ రెడ్డి, హోంగార్డులు కె.వి. రమణాచారి, బి. పూర్ణచంద్ర నాయక్ తదితర అగ్నిమాపక సిబ్బంది పాల్గొని సమయోచి తంగా మంటలను ఆర్పి పెద్ద ప్రమాదాన్ని తప్పించారు. గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.

## విద్యార్థినులకు మహిళా భద్రతపై అవగాహన






బద్వేలు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

బద్వేల్‌లోని శ్రీ బీజవేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాలలో మహిళా భద్రత, కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మైదుకూరు సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మెప్మా, ఐసిడిఎస్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, మహిళలు తమ భద్రత కోసం సైబర్ సెల్, శక్తి వంటి సేఫ్టీ యాప్‌లను ఫోన్లలో వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ ద్వారా ఎవరైనా వేధింపులకు గురిచేస్తే భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థినులు చదువుపై దృష్టి సారించి జీవితంలో మంచి స్థానం సంపాదించాలని, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ సుప్రజ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎల్లంరాజు, టౌన్ సీఐ రామకృష్ణ, ఎస్సై కొండారెడ్డి, రూరల్ సీఐ కృష్ణయ్య తదితరులు పాల్గొని తమ సందేశాలు అందించారు.

## 8వ పోషన పక్వాడ కార్యక్రమం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

మండలం వెల్లటూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 8వ పోషణ కార్యక్రమంలో భాగంగా పిల్లల ఆరోగ్యం కోసం బయట దొరికే జంక్ ఫుడ్ పెట్టకుండా ఇంట్లోనే చిరుతిండ్లు తయారు చేసుకునే విధానం గురించి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో తండ్రుల చేత ఆహారం తయారు చేయించడం జరిగింది. అలాగే పిల్లలకు ఆహారం తినిపించేటప్పుడు సెల్‌ఫోన్లు ఇవ్వడం కానీ, టీవీ చూపించడం చేయకుండా బయట పక్షులను జంతువులను చూపిస్తూ అన్నం తినిపించాలని అప్పుడే బిడ్డలకు ఆహారం ఒంటికి పడుతుందని తల్లిదండ్రులకు తెలిపారు. గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని సి.కె.దిన్నె సీడీపీవో శాంతమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

దువ్వూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు గాను జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి తెలిపారు. రవి సీజన్ లో ఈ క్రాప్ లో పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులు తమ రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తమ వద్ద జొన్న ఉత్పత్తులు ఇన్ని క్వింటాళ్లు ఉన్నాయని, వాటిని కొనుగోలు చేయాలని ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత సివిల్ సప్లై వారు జొన్న లో ఉన్న నాణ్యతా శాతాన్ని పరిశీలిస్తారని, 13 శాతంకు మించి తేమశాతం ఉండాలన్నారు. క్వింటాలుకు 3699 రూపాయల వంతున కొనుగోలు చేస్తారన్నారు. దువ్వూరు మండలంలోని డిసిఎంఎస్ ద్వారా జొన్నలు కొనుగోలు చేస్తామని, అందువల్ల జొన్న సాగు చేసిన రైతులు ఈ పంటలో నమోదు చేసుకొని ఉంటే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

### ఎర్ర చెరువులో పడి విద్యార్థి

## గుగ్గిల హరిశ్వర్ మృతి

మైదుకూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

కడప జిల్లా మైదుకూరు పట్టణ మున్సిపాలిటి వనిపెంట రోడ్డు ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న గుగ్గిల.చిన్న మున్నెయ్య కుమారుడు హరి ఈశ్వర్(18), వనిపెంట రోడ్డు ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న ఎర్ర చెరువులో పడి మృతి చెందడంతో వారి కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. గుగ్గిల.చిన్న మున్నెయ్య, భార్య మాధవి లకు నలుగురు సంతానం వారిలో ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు వారి వృత్తిరీత్యా గత కొన్ని సంవత్సరాల నుండి పాత గుడ్డలు తెచ్చుకొని మైదుకూరు ఇతర ప్రాంతాలలో సొంత జరిగే ప్రాంతంలో వ్యాపారాలు కొనసాగిస్తూ జీవనం సాగిస్తుంటారు. అయితే బుధవారం ఇంటి నుండి వెళ్లిన హరి ఈశ్వర్(18), సాయంత్రాన్ని ఇంటికి రాకపోవడంతో ఆందోళనలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు బేస్తవారం మైదుకూరు పట్టణ వనిపెంట రోడ్డు ఎర్ర చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులు శవాన్ని చూసి పోలీసులకు వారి కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారి కుటుంబ సభ్యులు ఎదిగి వచ్చిన కొడుకు చనిపోవడంతో కన్నీటి పర్యంతమయ్యారు. వివరాలు హరి ఈశ్వర్(18), ఇంటర్ సెకండియర్ పట్టణ ప్రైవేట్ కళాశాల లో పూర్తి చేసుకున్నాడు ఇంటర్ ఫలితాలలో ఫెయిల్ కావడం వల్ల మనోవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.



## జనగణనను సక్రమంగా నిర్వహించాలి

దువ్వూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనాభా లెక్కల సేకరణ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని మండల తాసిల్దార్ సంజీవరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ హైస్కూల్ నందు జనగణన కార్యక్రమంలో పాల్గొనే ఎన్యుమిలేటర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు స్వీయ గణన ద్వారా తమ పేర్లను నమోదు చేసుకుంటారని ఎన్యుమినేటర్ లు మే నెల 1వ తేదీ నుండి ఇంటింటికి వెళ్లి జనాభా లెక్కలు సేకరిస్తారు అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు ఆ ఇంటిలోని కుటుంబ సభ్యుల వివరాలు, వారి వృత్తి, అలాగే ఇంటిలో ఎటువంటి సౌకర్యాలు ఉన్నాయి వంటి వాటిని సేకరించాలన్నారు. వీటిలో ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ఎన్యూమినెటర్ లు చేసే సర్వేను సూపర్ వైజర్లు తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. ఈ సర్వేలో ఏమైనా అనుమానాలు ఉంటే వెంటనే పై అధికారులకు తెలియజేయాలన్నారు. జనగణన అనేది గత కొన్ని ఏళ్లుగా చేపట్టలేదని, ఈ జనాభా సేకరణ వల్ల అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటు అవుతుందని అందువల్ల దీనిని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ వేణుగోపాల్, ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శిక్షణ ఇచ్చేవారు రమేష్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాదాలపై మహిళలకు అవగాహన

### జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలు దూరం ఫైర్ ఆఫీసర్ చంద్రుడు





**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 16 ప్రభాతవార్త :**

అగ్ని ప్రమాదాల వారోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం తెలుగు కాలనీలోని అపార్ట్మెంట్ మరియు కాలనీవాసులకు అగ్ని ప్రమాదాల పట్ల వివిధ రకాల విన్యాసాలతో అవగాహన కార్యక్రమాన్ని అగ్నిమాపక ఇంచార్జ్ ఆఫీసర్ చంద్రుడు ఆధ్వర్యంలో నిర్వహించారు, అనుకోకుండా గ్యాస్ సిలిండర్ లో లీకేజీ ఐ మంటలు చెలరేగినప్పుడు తడిపట్ట, దుప్పటి లేదా బకెట్ తో ఎలా వాటిని అదుపు చేయాలో అగ్నిమాపక సిబ్బంది ద్వారా పలువురు మహిళలకు వివరిస్తూ వారి చేతుల మీదుగా మంటలను ఎలా అదుపు చేయాలో చూపించారు, అగ్ని ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు, అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రతి సంవత్సరం అగ్ని ప్రమాదాల వారోత్సవాలను నిర్వహించి పట్టణంలో అనేక చోట్ల ప్రజలను అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు, అనంతరం కాలనీలో ప్రతి ఒక్కరికి అగ్ని ప్రమాదాల వారోత్సవాల కరపత్రాలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సుధాకర్, మాబురెడ్డి, చెన్నయ్య, హరి కృష్ణా, శ్రీనివాసులు, పాములేటి నాయక్, రాజశేఖర్, బాలయ్య, రాజు, మరియు కాలనీవాసులు అల్తాఫ్, రూపరాజు మల్లికార్జునరావు, పలువురు కాలనీ లోని మహిళలు పలువురు ప్రజలు పాల్గొన్నారు.

**ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన :**

బద్వేల్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని ఫైర్ ఆఫీసర్ చంద్రుడు ఆధ్వర్యంలో ఆర్టిసి డిఎం కన్యాకుమారి మరియు పలువురు ఆర్టీసీ సిబ్బంది ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఆర్టీసీ బస్టాండులో ఉన్న ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల కరపత్రాలను అందజేసి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఎలా నివారించుకోవాలో ఫైర్ సిబ్బంది ద్వారా పలు రకాల విన్యాసాలతో పలువురికి అవగాహణ కల్పించడం జరిగింది, ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఎంప్లాయిస్ సిబ్బంది ప్రయాణికులు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

### నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించని ఏజెన్సీపై
# క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



**ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రి పారిశుద్ధ్య (శానిటరీ) కార్మికుల వేతనాలు నిబంధనల ప్రకారం చెల్లించకుండా తగ్గించి ఇస్తున్న ఏజెన్సీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెసి బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వారి మీద కార్మికులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 జనవరి నుంచి వచ్చిన కొత్త కాంట్రాక్టర్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 13900/ వేతనం ఇవ్వాల్సి ఉండగా తగ్గించి 11700/ 11,800/ జనవరి ఫిబ్రవరి నెలలకు వేతనాలు చెల్లించాడని పిఎఫ్ కూడా సక్రమంగా చెల్లించ కుండా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాడని అటు అధికారులు కార్మిక శాఖ స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందిని తెలిపారు. నిబంధనలు తుంగలో తొక్కి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్న ఏజెన్సీపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తప్పించి కార్మికులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు ఏసోబు సానిటరీ కార్మి కులు రాజమ్మ ప్రమీలమ్మ సరోజమ్మ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గర్భస్రావాలపై కఠిన చర్యలు

### డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ వి. మల్లేష్,



**మైదుకూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

కడప జిల్లా బద్వేలు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ ఏడాది మార్చి నెలలో నమోదైన అబార్షన్లపై (గర్భస్రావాలు) గురువారం ఆడిట్ నిర్వహించారు. డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ వి. మల్లేష్ ఆధ్వర్యంలో మైదుకూరులోని కృష్ణాపురం పట్టణ ఆరోగ్య కేంద్రం (యు పి హెచ్ సి) మందు జరిగింది. ఈ ఆడిట్ కార్యక్రమానికి పలు ప్రాథమిక మరియు పట్టణ ఆరోగ్య కేంద్రం వారు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ, గర్భస్రావాల విషయంలో ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. అబార్షన్ల ప్రక్రియలో సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను పారదర్శకగా నిర్వహించాలని సూచించారు. నిబంధనల ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ వి. సుధా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి ఎబి .పుష్పాంజలి, పి. హెచ్. ఎన్‌లు, సూపర్వైజర్, కె. వీరాంజనేయులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

## కాపు భవనం స్థలం కేటాయింపుకై వినతి



**బద్వేలు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

కాపు భవనం స్థలంకోసం గురువారం నూతన తహసిల్దార్ షేక్ పీర్ మున్నికి బద్వేలు బలిజ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఇందులో భాగంగా కాపు భవనం స్థలం కేటాయింపు కొరకు వెంటనే పరిశీలించి బద్వేల్ యందు స్థల సేకరణ చేయవలసిందిగా ఆమెను కోరారు. ఈ విషయపై తహసిల్దార్ సానుకూలంగా స్పందించి అతి త్వరలో మీకు స్థలాన్ని కేటాయిస్తానని. హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి కొంకుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు కొర్రపాటి సురేంద్ర, పందుగాయల శ్రీనివాసులు, నీలి శ్రీనివాసులు, వావిళ్ళ వెంకటయ్య పాల్గొన్నారు.

## వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



**బద్వేలు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

డాక్టర్ జి.రాజేష్ కుమార్ మెడికల్ ఆఫీసర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టిగారి పల్లె బద్వేల్. ఈరోజు అనగా 16 /04 /2025వ తేదీన బద్వేల్ మండలము తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వనంపుల సచివాలయం పరిధిలోని నంది పల్లె నందు చంద్రన్న చికిత్స కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్ పాల్గొని వడదెబ్బను గురించి ప్రజలకు సలహాలు సూచనలు ఇవ్వడం అయినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్ మాట్లాడుతూ రైతులు, ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రతి అంగన్వాడి సెంటర్ విలేజ్ హెల్త్ క్లినిక్ నందు ఆశా కార్యకర్తల వద్ద ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఓ.ఆర్ యస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడమైనది. అనంతరము ప్రజలకు వడదెబ్బ యొక్క పాంప్లెట్స్, ఓ ఆర్ ఎస్ పంపిణీ చేయడం అయినది అదేవిధంగా గర్భిణీలు, చిన్నపిల్లలు తల్లులు, వృద్ధులు వేసవి కాలములో చాలా జాగ్రత్తగా ఉండి తమరి ఆరోగ్యాన్ని కాపాడుకుంటారని వడదెబ్బకు గురికాకుండా చూసుకుంటారని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో విలేజి హెల్త్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జోష్ణ ఏఎన్ఎం పి నాగమ్మ రాములమ్మ ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, రుక్మిణమ్మ మరియు 104 సిబ్బంది పాల్గొనడం అయినది.

## వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి




**యర్రగుంట్ల ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

యర్రగుంట్ల మార్కెట్ యార్డ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు 16, 17, 18 తేదీలలో ప్రభుత్వ యునాని వైద్యులు డాక్టర్ షాహిన్ పర్వీన్ ఆధ్వర్యంలో యునాని వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ యునాని వైద్య బృందం పరీక్షించి (వనమూలికలతో తయారుచేసిన) మందులు ఉచితంగా అందజేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### విద్యార్థుల సర్టిఫికెట్లు
# త్వరితగతిన మంజూరు చేయండి

**నందలూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :**

తాసిల్దార్ కార్యాలయంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లను వీలైనంత త్వరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సిటిజన్ సంస్థ అధ్యక్షులు ఆర్ముగం విశ్వనాథ్ తాసిల్దార్ శివలక్ష్మి కి వినతి పత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థుల పరీక్షా ఫలితాలు వెలువడుతున్నాయని, విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్ల డానికి, ఎంట్రన్స్ పరీక్షలకు వెళ్లడం కోసం క్యాస్ట్, ఇన్కమ్, నేటివిటీ సర్టిఫికెట్స్, ఇతర సర్టిఫికెట్స్ త్వరితగతిన మంజూరు చేసేటట్లు చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ ను కోరినట్లు తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని, విద్యార్థు లు ఇబ్బందులు పడే అవకాశం ఉందని కావున సచివాలయ సిబ్బందికి, వీఆర్వో లకు, ఆర్ ఐ లకు ఆదేశాలు జారీ చేసి సకాలంలో తొందరగా సర్టిఫికెట్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిటిజన్ సభ్యులు ఆదినారాయణ, సయ్యద్ అమీర్, విజయుడు, కానకుర్తి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



### స్వీయ గణన ద్వారా ప్రజలందరూ
# ఐడి నమోదు చేసుకోండి

### తహసీల్దార్ పీర్ మున్ని



**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుచున్న సెన్సస్2027కు సంబం ధించి బద్వేల్ 16.04.2026 వ తేది నుండి 30.04.2026 వ తేది వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేప ట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రజలే నేరుగా వారి యొక్క కుటుంబ సభ్యుల మరియు గృహవసతుల వివరాలను నమోదు చేసుకొనవచ్చునన్నారు, దానికి సంబంధించి ఎస్ ఈ. సెన్సస్.గౌవ్. ఇన్, వెబ్ సైట్ నందు మీరే స్వయముగా నమోదు చేసుకొని దానికి సంబధించిన స్వీయగణన గుర్తింపు నెంబరును సెన్సస్ గణన అధికారులు మీ ఇంటి వద్దకు వచ్చిన పుడు స్వీయగణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడి) గుర్తింపు నెంబరును వారికి తెలియజేసిన ఎడల సంబంధిత ఎన్యుమరేటర్లు వాటిని పరిశీలించి మీ యొక్క వివరాలను పూర్తి చేయగలరన్నారు. కావున అవకా శమును తప్పనిసరిగా ప్రజలందరు వినియోగించు కోవాలని తహసీల్దారు తెలిపారు.

## ప్రజల నిత్య చైతన్యానికి ప్రేరణ నాటకం




**వైవీయూ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

మానవ సమాజంలో నాటకం అజరామరం.. నిత్య చైతన్యానికి ప్రేరణ అని యోగివేమన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్‌హ్యూమానిటీస్ విభాగ డీన్ ప్రొఫెసర్ కంకణాల గంగయ్య అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ శాఖ పరిధిలోని థియేటర్ ఆర్ట్స్ విభాగం కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా " తెలుగు నాటక రంగ దినోత్సవం" లో భాగంగా ఆయన చిత్రపటానికి ప్రొఫెసర్ కంకణాల గంగయ్య, ఫైన్ ఆర్ట్స్ శాఖ హెడ్ డాక్టర్ కోటా మృత్యుంజయరావు, రంగస్థలం కళల విభాగ అధ్యాపకులు డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ హ్యూమానిటీస్ విభాగ డీన్ ప్రొఫెసర్ కంకణాల గంగయ్య మాట్లాడుతూ తెలుగు నాటకరంగ పితామహుడు కందుకూరి వీరేశలింగం తన నాటకాల ద్వారా తెలుగు ప్రజల్లో సామాజిక స్పృహ చైతన్యాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సురభి నాటక సమాజం తెలుగువారు అలానే కడప జిల్లాకు చెందిన వారు కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. రంగస్థలం కలలో పేరు ప్రఖ్యాతులు సాధించిన సూలం పోలయ్య (కొల్లూరు మండలం సీతారుపల్లి), జల్దీ గంగయ్య (ఎర్రగుంట్ల), తంగా నారాయణ యాదవ్ (చింతకొమ్మదిన్నె మండలం అశ్వర్థ గారి పల్లె) లను ఘనంగా సత్కరించారు. కళాకారులు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, ఫైన్ ఆర్ట్ శాఖ అధ్యాపకులు సిహెచ్ వెంకటేష్, బి ఈరప్ప, బి.శచిన్న రాయుడు, ఎం వాసవి, ఎస్ చంటి, వలసి గాండ్ల సుధాకర్, విద్యార్థులు కళాకారులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయాల జోరు

**ముద్దనూరు ఏప్రిల్.16 ప్రభాతవార్త;**

ముద్దనూరు పట్టణం తర్వాత ప్రజలు ఎక్కువగా వ్యాపార లావాదేవీలు సాగించేది మండలంలోని ఉప్పులూరు గ్రామం కావడంతో అక్రమ మద్యం విక్రయదారులు ఆ గ్రామాన్ని ఆసరాగా చేసుకుని మద్యం విక్రయాలు జోరుగానే సాగుతున్నాయని ప్రజలలో చర్చ నడుస్తుంది. కూలి పనులు చేసుకొనే నిరుపేద కుటుంబాలనే ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు గ్రామాలలో మద్యాన్ని అధిక రేట్లకు విక్రయించడంతో రోజు కూలి వారి 400 కూలి సంపాదన ఉంటే 300 రూపాయలు మద్యం తాగడానికే ఖర్చు అవడంతో కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు తలెత్తుతున్నాయని, అక్రమ మద్యం విక్రయించకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇంటర్‌లో గురుకుల బాలికల సత్తా

**నందలూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :**

మండలంలోని గురుకుల విద్యాసంస్థలు ఇంటర్మీడియట్ ఫలితాల్లో మరోసారి తమ ప్రతిభను కనపరిచాయి. మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల బాలికలు, అలాగే ఆడపూరులోని డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించి మెరిశారు. మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 140 మంది విద్యార్థినులు పరీక్షలకు హాజరై 139 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 138 మంది హాజరై అందరూ ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ప్రథమ సంవత్సరంలో MPC మణీషా (463), శి. నిహారిక (462), శి. చరిష్మా (461) మార్కులతో టాప్‌లో నిలిచారు. BiPCలో హర్షిత (448), మహాలక్ష్మి (446), బి. వరలక్ష్మి (445) ప్రతిభ చాటారు. MECలో మధురిమ (471), సింధు (469), హిమ బిందు (466) రాణించగా, CECలో అమూల్య (494), త్రివేణి (490), అఫిజా, వర్ష (487) మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో MPCలో చంద్రకళ (981), స్పందన (976), కుమారి (974) అగ్రస్థానాల్లో నిలిచారు. BiPCలో హారిక, పూజిత శ్రీ (971), చైత్ర వర్ధిని (959), దేవదర్శిని (957) రాణించగా, CECలో లక్ష్మీదేవి (970), నందిని (943), మాధవి (934) ప్రతిభ కనబరిచారు. ఆడపూరులోని డా. బి.ఆర్ అంబేద్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో బెనిత జాక్ లైన్ (449), లక్ష్మీప్రియ (440), హర్షిత (427) మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో MPCలో కావేరి (976), నందిని (964), మహేంద్రమ్మ (891) రాణించగా, BiPCలో శైలమ్మ (951), లావణ్య (922), సుకన్య (916) మెరిశారు. అలాగే BiPC ప్రథమ ఇంటర్‌లో అనూష (447), లక్ష్మీ భావన (444), వాణి (432) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, అంబేద్కర్ గురుకుల ప్రిన్సిపాల్ హైమావతి విద్యార్థినులను అభినందిస్తూ, వారి కృషి, అధ్యాపకుల శ్రమ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.



## జహంగీర్ భాషను సన్మానించిన నాయకులు



**బద్వేలు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

ఇటీవల సీమాంక్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్‌గా ఎన్నికైన షేక్ జహంగీర్ భాషను గురువారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దళిత నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో చురుకుగా పని చేస్తూ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న జహంగీర్ భాషకు పార్టీ అధిష్టానం గుర్తించి సీమాంక్ అభివృద్ధి కమిటీ మెంబర్గా నియమించడం హర్షించదగ్గ విషయం అన్నారు సీమంత ఆస్పత్రి అభివృద్ధికి జహంగీర్ భాష పాటుపడాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో దళిత నాయకులు గొల్లపల్లి మల్లయ్య, గొడుగునూరు విజయ్, బంక కార్తీక్, రాయప్ప, మారయ్య, సుంకర కొండయ్య పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో నయోమిహెలీన ప్రతిభ



**సుండుపల్లె, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామం కోడూరు వాండ్లపల్లికు చెందిన మద్దెల. చిట్టిబాబు కుమార్తె నయోమి హెలీన విజయవాడ శ్రీచైతన్య గోశాల బ్రాంచ్ లో ఇంటర్ మొదటి సంవత్సరం బై పి సి గ్రూప్ లో 455 మార్కులకు గాను 436 మార్కులు సాధించి A గ్రేడ్‌లో నిలిచింది. తల్లి దండ్రులు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి చదివితే ఏమైనా సాదించగలము అనేమాటను రుజువు చేసిన ఈ అమ్మాయిని అభినందించాల్సిదే. అలాగే లిటిల్ ఫ్లవర్ పాఠశాల పూర్వపు విద్యార్థులు ఏం. రెడ్డి సంజన ఏంపిసి (986), ఏం. వైష్ణవి బైపిసి (984), పృద్వివర్మ ఏం పి సి(965), ఎ. పురుషోత్తం ఏంపిసి (940), ఎస్. అక్షర (461)మొదటి సంవత్సరం. ప్రభంజనం మోగించారని కరస్పాండెంట్ నాగేశ్వరావు తెలియజేసారు.

## త్రాగునీటి బోరును తయారు చేపించిన శ్రీనివాస్ రెడ్డి

**కలసపాడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:**

మండలంలోని మహానంది పల్లి గ్రామంలో గత మూడు రోజుల నుంచి మోటార్ ఆడకపోవడంతో మాజీ సర్పంచ్ భర్త శ్రీనివాస్ రెడ్డికు ప్రజలు తెలపడంతో మెకానిక్ పిలిపించి ప్రజలకు త్రాగునీరు సమస్య లేకుండా మో టర్ ను బాగు చేపించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఐఏఎస్ కావడమే లక్ష్యం

### శ్రీవిద్య కళాశాల టాపర్ గణేష్ ఆశాభావం

**ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు ఇంటర్ ఫలితాల్లో పట్టణంలోని వినాయక నగర్‌కు చెందిన పెయింటర్ మేస్త్రీ కుండా బాలదాసు, లక్ష్మిల కుమారుడు కుండా తిరుమల గణేష్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 994 మార్కులతో టాపర్ గా నిలిచాడు. ఇతని తండ్రి పెయింటర్ మేస్త్రీ, తల్లి గృహిణి. ఇంటర్ ఎంపీసీ శ్రీవిద్యా జూనియర్ కళాశాలలో చదువుకుని బుధవారం వెలువడిన ఫలితాల్లో 1000 మార్కులను గాను 994 మార్కులు సాధించి రాష్ట్రంలోనే ప్రథమంగా నిలిచాడు. తండ్రి బాలదాసు గత 2 ఏళ్లుగా లివర్ దెబ్బతినడంతో ఆర్థిక పరిస్థితుల దృష్యా ఇబ్బందుల్లో ఉండటంతో కష్టపడి చదువుకుని మంచి మార్కులు సాధించాడు. కళాశాలలో అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా వినడంతో పాటు పరీక్షల్లో తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవడం వల్ల ఉత్తమ మార్కులు పొందడానికి దోహదపడ్డాయని గణేష్ తెలిపారు. ఇంటర్ కళాశాలలో ఉచితంగా విద్యాబోధన చేసినందుకు బీటెక్ సీఎస్ఈ తీసుకుని భవిష్యత్తులో సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని చెప్పాడు. ఈ విద్యార్థి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఎస్ఎస్ యూపీ స్కూల్, 10వ తరగతి వరకు జీవన జ్యోతి హైస్కూల్లో చదివాడు. పదవ తరగతిలో 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించి నందుకు శ్రీ విద్య జూనియర్ కళాశాల యాజమాన్యం ఉచిత బోధన చేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభకనపరిచిన విద్యార్థి గణేష్ను ప్రిన్సిపాల్ రమణరావు, కరస్పాండెంట్ శ్రీకాంత్రెడ్డి, డైరెక్టరు రామ్మోహన్, తల్లిదండ్రులు అభినందించారు.



## 78 మందికి టిబి పరీక్షలు



**సుండుపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టిబి ముక్త భారత్ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించబడిందని ఈ కార్యక్రమంలో గ్రామాలనుండి వచ్చిన ప్రజలందరికీ 16 వతేది ఉచితంగా 78 మందికి ఛాతీ ఎక్స్ రే పరీక్షలు నిర్వహించామని డాక్టర్ పర్వా ఖానం డాక్టర్ దిలీప్ గుప్త తెలియజేసారు. వారు మాట్లాడుతు క్షయవ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు తక్షణ చికిత్స అందించే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టిందని అందరు సహకారం అందించి, పెద్ద ఎత్తున పరీక్షలు చేయించుకున్నారన్నారు. టిబి వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పరీక్షలు మరియు మందులను వినియోగించుకోవాలని సూచించారు. రెండు వారాలకంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం లాంటివి ఉంటే డాక్టర్ ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామకృష్ణ యాదవ్, సూపర్వైజర్ సదాశివ రెడ్డి, టిబి సూపర్వైజర్ నాగేశ్, గంగాదేవి మణికంఠతో పాటు, సి హెచ్ఓలు ,వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జనగణన శిక్షణ

**వీరపునాయునిపల్లి ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

వీరపునాయునిపల్లిలోని సంగమేశ్వర ఉన్నత పాఠశాల నందు గురువారం జనగణనపై మూడు రోజులశిక్షణా కార్యక్రమాన్ని తాసిల్దార్ బి లక్ష్మీదేవి ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందికి మొదటి విడతశిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు ట్రైనర్ ఆర్ ప్రసాద్ రెడ్డి వీరికి జనగణన పై శిక్షణ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎనీవేటర్స్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడికి ఘన సత్కారం

**సిద్ధవటం ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన టిడిపి సీనియర్ నేత బాలిశెట్టి హరిప్రసాద్‌కు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించామని సిద్ధవటం మండల టిడిపి అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మండలంలోని మూలపల్లి గ్రామం తన నివాసంలో గురువారం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ కార్యకర్తలకు అందుబాటు ఉండే బాలిశెట్టి హరిప్రసాద్ కు తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా ఆయనకు ఘనంగా సత్కరించి గజమాలు వేసి సంబరాలు జరుపుకున్నామని పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అధిష్టానం గుర్తించి మండల , జిల్లా, రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో పదవులు కట్టబడుతుందని తెలిపారు రాబోయే స్థానిక ఎలక్షన్లో అందరూ కలిసికట్టుగా స్థానిక మండల స్థాయి ఎలక్షన్లో కలిసి పని చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజర్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు గోపిశెట్టి నాగరాజు సిద్ధవటం మాజీ సర్పంచ్ భవనాసి ఓబులయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు పుత్త, రాజు పాల్గొన్నారు



# అగ్ని ప్రమాదాలపై అవగాహన

### గ్యాస్ భద్రతపై కీలక సూచనలు చేసిన ఫైర్ ఆఫీసర్ సునీల్ కుమార్





**పులివెందుల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**

అగ్రిమాపక వారోత్సవాల సందర్భంగా పులివెందుల పట్టణంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా ఫైర్ ఆఫీసర్ పీ. సునీల్ కుమార్ ఆధ్వ ర్యంలో ముద్దనూరు రోడ్డులోని జయమ్మ కాలనీలో గురువారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు గ్యాస్ విని యోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల సమయంలో అనుసరించా ల్సిన నివారణ చర్యలపై వివరణాత్మకంగా అవగాహన కల్పించారు. గృహాల లో, వంటగదిలో మరియు గ్రామీణ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరగకుం డా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ లీక్ అనుమానం ఉన్నప్పు డు వెంటనే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని, అటువంటి సమయంలో ఎలక్ట్రికల్ స్విచ్‌లను ఆన్ లేదా ఆఫ్ చేయకూడదని సూచించారు. గ్యాస్ స్టవ్‌లను నేల మట్టానికి కొంచెం ఎత్తులో అమర్చుకోవా లని తెలిపారు. అలాగే వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్ వంటి దహన పదార్థాలు, అదనపు గ్యాస్ సిలిం డర్లను నిల్వ ఉంచకూడదని, అగ్గిపెట్టెలను పిల్లలకు అందుబాటులో లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రవీందర్, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా మునికుమార్

**పులివెందుల, ఏప్రిల్ 16 , ప్రభాత వార్త :**



పులివెందుల మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్‌గా మునికుమార్‌ను నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు ముందు తాత్కాలిక కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఇప్పుడు పూర్తిస్థాయి బాధ్యతలు అప్ప గించబడినట్లు మున్సిపల్ మంత్రిత్వ శాఖ వెల్ల డించింది. గతంలో పనిచేసిన మునుపటి కమి షనర్ రాముడు పై వచ్చిన ఆరోపణల నేపథ్యం లో ఆయనను బదిలీ చేయడంతో, ప్రభుత్వం తా త్కాలికంగా మునికుమార్ ను కమిషనర్‌గా నియ మించింది. అప్పటి నుంచి పనిచేస్తున్న మునికుమార్ పనితీరు సంతృప్తికరంగా ఉండటంతో ప్రభుత్వం ఆయనను పూర్తిస్థాయి కమిషనర్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. గురువారం వెలువడిన ఉత్తర్వులతో మునికుమార్ అధికా రికంగా పులివెందుల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన నియామ కంపై స్థానిక ప్రజలు, ప్రజాప్రతి నిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతా యని ప్రజలు ఆశాభా వం వ్యక్తం చేస్తున్నారు.

## మురికి కాలువకు శాశ్విత పరిష్కారం చూపండి



**దువ్వూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులో మురికి కాలువ అస్తవ్యస్తంగా ఉందని దా నికి శాశ్విత పరిష్కారం చూపాలని మండల బీజేపీ నాయకులు ఎంపీడీవో సు బ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం దువ్వూరు గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో ఉన్నారని అందువల్ల ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. దువ్వూరులోని మురికి కాలువలు అధ్వాన పరిస్థితిలో ఉన్నాయని, నంద్యాల రోడ్డులో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మురికి నీరు అంతా రోడ్డుపై ప్రవహిస్తుందని, దీంతో అక్కడ వా హనాల్లో వెళ్లేవారు, అలాగే కాలి నడకన వెళ్లే వారు అనేక ఇబ్బందులు పడు తున్నారన్నారు. గత కొన్ని రోజులుగా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు పోయినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపా లని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరవేటి హరికృష్ణ, బీజేపీ నాయకులు పల్లె సుబ్బారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులకు హెల్మెట్ లైసెన్స్ తప్పనిసరి



**సిద్ధవటం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

ప్రతి ద్విచక్ర వాహనదారుడు లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని ఎస్సై హరిక తెలిపారు సిద్ధవటం గ్రామ శివారులోని మూలపల్లె క్రాస్ వద్ద గు రువారం సాయంత్రం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టారు ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ సరైన పత్రాలు లేనివాహన 15 ద్విచక్ర వాహనదారులకు ఒక్కో వాహనానికి 185, రూ జరిమానా విధించామని ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాహన సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని మ ద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు ఇసుక వాహనాలు ఇతరులకు ఇబ్బందికరంగా లేకుండా ప్రతి ఒక్కరు పట్టబిగిం చి ఇసుక తీసుకెళ్లాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కొండయ్య స్థానిక పోలీసులు శివ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధల మధ్య సత్యసాయి వ్రతం

**వేంపల్లె ఏప్రిల్ 16 ప్రభాతవార్త**



స్థానిక శ్రీ చైతన్య హై స్కూల్ ఆవరణలో ఉన్న శ్రీ గణేశ సాయి ఆలయ 14వ వార్షికోత్సవ వేడుక లు ఏప్రిల్ 15 బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబ డ్డాయని పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బి.చ క్రపాణిరెడ్డి కుటుంబ సమేతంగా ఆలయంలో సామూహిక సత్యసా యి వ్రతాన్ని ఆచరించారు. ఉపా ధ్యాయినీలు, భక్తులు కూడా ఈ వ్రతంలో పాల్గొన్నారు. వేడుకలలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, వేదపారాయణం భక్తులకు ఆధ్యాత్మిక ఆనం దాన్ని పంచాయి. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమా లు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలు, కోలాటం, భక్తి గీతాలు, సాయి లీలా విన్యాసాలు ప్రేక్షకులను అలరించాయి. తరువాత శ్రీ గణేశ సాయి స్వామి విగ్రహాన్ని పాఠశాల ప్రాంగణంలో పుష్పాలతో అలంకరించిన పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు "ఓం శ్రీ సాయినాథాయ నమః" నినా దాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు. పాల్గొన్న భక్తులకు ప్రత్యేక ప్రసాదం పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సమష్టిగా ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. అనంతరం బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ, గత 14 ఏళ్లుగా కొనసాగుతున్న గణేశ సాయి సేవా కా ర్యక్రమాలు భక్తి విశ్వాసాలతో ముందుకు సాగుతున్నాయని, భవిష్యత్తులో మ రిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సంకల్పం వ్యక్తం చేశారు.

### ఏప్రిల్ 16 నుంచి 30 వరకు

## జనగణన స్వీయ నమోదు

**పులివెందుల, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :**



దేశవ్యాప్తంగా నిర్వహించ నున్న జనగణన 2027 ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు స్వీయ నమోదు కార్యక్రమా న్ని ప్రభుత్వం ప్రారంభించింది. ప్రజలు తమ గృహాల వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలా https://se.census.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ సౌకర్యం అం దుబాటులో ఉంచినట్లు అవకాశాన్ని సద్వినియోగం చే సుకోవాలని మున్సిపల్ కమిషనర్ మునికుమార్ అ న్నారు. గురువారం మీడియాతో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఈ ప్రక్రి యలో ప్రజలు స్వయంగా తమ కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసు కోవచ్చు అని స్వీయ నమోదు పూర్తిచేసిన వారికి ప్రత్యేకంగా ఒక యూనిక్ ఐడి జనరేట్ అవుతుంది. ఈ ఐడి ను ఎన్యూమరేటర్ కు చూపించడం ద్వారా తదుపరి ప్రక్రియ సులభంగా పూర్తవు తుందనీ ఇంటర్నెట్ సదుపా యం లేని వారు లేదా స్వయంగా నమోదు చేసుకోలేని వారు ఇంటింటికీ వచ్చే ఎన్యూ మరేటర్ల సహాయం తీసుకోవచ్చని అధికారులు సూచించారు. జనగణనలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరా రు. ఇక,జనగణన2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ కూడా నిర్వ హించబడనుందనీ తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా హెచ్ ఎల్ వో యాప్ ఉపయోగించి అధికారులు డేటా సేకరణ చేపడతారు. ప్రజలు ఎలాంటి అపో హలకు లోనవకుండా, తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ప్రభుత్వ కార్యక్రమానికి సహకరించా లని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## భళారే " బాతు పనస "

**చౌడేపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**



బాతును పోలిన పనసతోలు

పనస తోలు బాతును పోలి అబ్బురపరచింది. పందిళ్ళపల్లి పంచాయతీ చుక్కావారిపల్లి కుమార్ పొలంలోని పనస కాయను కోయగా అందులోని పనసతోలు బాతును పోలి అందరి దృష్టిని ఆకర్షించింది.

## ఈనెల 25, 26న ఏపిడబ్ల్యుజేఎఫ్ ఎన్నికలు

### యూనియన్ జిల్లా కన్వీనర్లు వెల్లడి




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్

**మదనపల్లె, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :**

ఈనెల 25, 26వ తేదీల్లో మదనపల్లెలోని ఆర్అండ్‌బి అతిథిభవనం నందు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్(ఎలక్ట్రానిక్‌మీడియా) అన్నమయ్యా జిల్లా ఎన్నికలు నిర్వహిం చబడుతాయని జిల్లా కన్వీనర్లు జి.రమేష్‌బాబు, వి.రెడ్డిప్రసాద్‌లు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యవర్గం ఎన్నికలకు సంబంధించి నిర్ణయం తీసుకొన్నట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికార్లుగా కె.మంజునాథ్, ఎన్.మోహన్‌లను జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకొందన్నారు. 16నుంచి 23వతేది వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. 24న ఎన్నికల జాబితా ప్రచురణ, 25న ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు నామినేషన్ ప్రక్రియ జరుగు తుందన్నారు. అదేరోజు 12గంటల నుంచి 1గంట వరకు నామినేషన్ల పరిశీలన, 1గంట నుంచి 4గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 5గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారన్నారు. 26న ఉదయం 10గంటలనుంచి 3గంటల వరకు ఎన్నికల నిర్వహణ, అనంతరం ఓట్లు లెక్కింపు, ఫలితాలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాయలసీమ జిల్లా ఇన్‌చార్జ్ కె.జయరాజ్, జిల్లా అక్రిడేషన్ కమిటీసభ్యులు జాకీర్‌హుస్సేన్, తదితర నాయకులు హాజరవుతారన్నారు.

## విద్యార్థినిని అభినందించిన జనసేన నాయకులు



**మదనపల్లె, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :**

ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో పట్టణంలో ప్రథమస్తానంలో వచ్చిన విద్యార్థిని కీర్తిని జనసేన పార్టీ నాయకులు దారం అనిత, రాయల్‌గణిలు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మీడి యట్ మొదటి సంవత్సరం చదువుతున్న కీర్తి మొదటి సంవత్సరం ఫలితా ల్లో 464మార్కులు సాధించి పట్టణంలో ప్రథమ స్తానంలో రావడం జరిగిం ది. విద్యార్థిని తల్లిదండ్రులు చలపతి,మేరీజియాలు ఇద్దరూ దివ్యాంగులు కావడంతో విద్యార్థిని పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాదించడంపట్ల పట్టణంలోని పలువురు అభినందించారు. భవిష్యత్తులో ఉన్నతవిద్యలో రాణించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు.

## జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్

### సెల్ఫ్ ఎన్యూమరేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మండపల్లి



**చిన్నమండెం ఏప్రిల్ 16 ప్రబాతవార్త:**

గురువారం రోజు ఉదయం మండలంలోని పడమటికోన గ్రామం బోరెడ్డి గారిపల్లిలో మంత్రిగారి స్వగృహం నందు జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ - సెల్ఫ్ ఎన్యూ మరేషన్ ప్రక్రియను రవాణా మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి స్వయంగా పూర్తి చేయడం నిజంగా ఆదర్శప్రా యమైన ముందడుగు..ప్రజలతో ప్రత్యక్షంగా కలిసిపోయి, ప్రభుత్వ కార్యక్రమాలపై నమ్మకం పెంచేలా నాయకులు స్వయంగా ముందుకు రావడం ఎంతో శ్లాఘనీయం. ఈ చర్య ద్వారా ప్రజల్లో అవగాహన పెరగడమే కాకుండా, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని స్ఫూర్తి కలుగుతుంది. జనగణన విజయవంతం కావడం దేశ అభివృద్ధికి కీలకం. అలాంటి కీలక కార్యక్రమంలో నాయకత్వం చూపించిన ఈ చర్య నిజంగా ప్రశంసనీయం.

## మహిళా కార్యదర్శిని సన్మానించిన తెలుగుయువత అధ్యక్షులు

**మదనపల్లె, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నియామకమైన పచ్చిపాల తులసీని రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు ఘనంగా సన్మానించారు. గురువారం ఆమెతో పాటు విశ్వబ్రాహ్మణ అభివృద్ధి సంక్షేమ డైరెక్టర్ పచ్చిపాల రామక్రిష్ణఆచారిని శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్‌లు ఎంతో నమ్మకంతో ఇద్దరికి పార్టీలో రాష్ట్ర పదవులు ఇవ్వడం అభినందనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషిచేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో టిడిపి విజయకేతనం పొందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం చినబాబు ను పచ్చిపాల రామక్రిష్ణ దంపతులు శాలువకప్పి ఘనంగా సత్కరించారు.



## ప్రభుత్వ స్థలం దురాక్రమణపై చర్యలు తీసుకోండి



ఎంపిడిఒకు వినతిపత్రమందిస్తున్న సింగిల్‌విండో ఛేర్మన్ హరిరాయల్ తదితరులు

**చౌడేపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

ప్రభుత్వ స్థలం దుకాక్రమణ జరిగిందనీ చర్యలు తీసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు పగడాల హరిరాయల్ ఎంపిడిఓ లీలామాధవిని కోరారు. ఈ మేరకు ఆయన తేదేపా నాయకులతో కలిసి వినతిపత్రా న్నందించారు. కార్యాలయం ముందున్న స్థలంలో ఆక్రమించుకొని రేకులషెడ్డును ఏర్పాటు చేశారనీ, తొలగించి ప్రభుత్వ స్థలాన్ని రక్షిం చాలని వారు కోరినట్లు ఆయన వివరించారు. కాగా కార్యాలయం ప్రహరీకి ఆవలివైపున్న తమకు సంబంధం లేదని ఎంపిడిఓ లీలా మాధవి అనడం సమజసం కాదని హరిరాయల్ అన్నారు. ప్రభుత్వ కార్యాలయం ఎదుటనే దురాక్రమణ జరుగుతున్నా రెవిన్యూ, మండల పరిషత్ అధికారులు పట్టించుకోలేదన్నారు. నాయకులు కార్తీక్‌మురళి, జనసేన చరణ్‌రాయల్ తదితరులు వినతిపత్రమందించిన వారిలో వున్నారు.

## ఒడిసి ఆకు తాగి బాలుడు ఆత్మహత్యయత్నం

**నిమ్మనపల్లి ఏప్రిల్ 16 ప్రభాతవార్త**



నిమ్మనపల్లి మండలం రెడ్డివారి పల్లి పంచాయతీ సోమానుపల్లి కాలనీలో కాపురం ఉండు టేకు ముందా చంద్ర నవీన్ వయసు 17 సంవత్స రాలు అను అతను పదవ తరగతి వరకు చదువుకొని ఇంటి వద్దనే ఉన్నాడు. అయితే ఇంటి వద్ద ఏ పని పాట చేయకుండా ఖాళీగా జులా యిగా తిరుగుతున్నాడని నవీన్ తండ్రి చంద్ర తిట్టి, కొట్టడంతో నవీన్ మనస్థాపం చెంది తన ఇంటి పక్కనే ఉన్నటువంటి ఒడిసి ఆకును తిని ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యు లు వెంటనే అతడిని ప్రైవేటు వాహనం నందు మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అతని పరిస్థితి ప్రస్తుతం స్థిమితంగానే ఉన్నదని డాక్టర్లు చెప్పినట్లు తెలిపారు.

## ట్రాన్స్‌కో అధికారుల చరవతో ఆలయానికి విద్యుత్తు సౌకర్యం

**కలికిరి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:**

కలికిరి మండలం ట్రాన్స్‌కో ఏడీ శివయ్య, ట్రాన్స్‌కో ఏఈ ముజీబర్ రెహమాన్‌ల చొరవతో శ్రీ నల్లగంగమ్మ అమ్మవారి ఆలయానికి విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు కావడం జరిగింది. మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ నల్లగంగమ్మ దేవత ఆలయానికి విద్యుత్తు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో అధికారులు స్పందించి ఆలయానికి విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ లైన్‌మెన్ నరసింహులు, గ్రామస్థులు పాల్గొన్నారు. దీంతో గ్రామస్థులు ట్రాన్స్‌కో అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటర్ ఫలితాలలో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**చిన్నమండెం ఏప్రిల్ 16 ప్రబాతవార్త:**



మండలంలోని మోడల్ స్కూల్ లో ఇంటర్ చదువుతున్న విద్యా ర్థులు బుధవారం వెలువడిన ఫలి తాల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభను చాటారు. ఈ పాఠశాలలో ఫస్ట్ ఇయర్ లో 150 మంది విద్యార్థులకు 108 మంది పాసయ్యారు. అలాగే సెకండ్ ఇయర్ లో 128 మందికి 97 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ వలి తెలిపారు. పాసైన వారిలో సెకండ్ ఇయర్ బైపిసి విద్యార్థిని సుమియా 1000 కి 967 మార్కులు సాధించి టాపర్ గా నిలిచింది. అలాగే సెకండ్ ఎంపీసి లో బూసర పల్లవి 1000 కి 964 సాధించి టాపర్ గా నిలిచింది. ఫస్ట్ ఇయర్ లో ఎంపిసి లో జగన్నాథం 455 కు 448 సాధించారు. సెకండ్ ఎంపిసి లో పల్లవి 1000కి 964 మార్కులు సాధించారు. వారిని ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు అభినందించారు.

కస్తూరిబా బాలికల పాఠశాలలో ప్రదమ సంవత్సరం 92 శాతము రెండవ సంవత్సరం లో 96 శాతము ఉత్తీర్ణత సాధించారు. వారిలో ఫస్ట్ ఇయర్ లో 451 సెకండ్ ఇయర్ లో 979 మార్కులు సాధించి నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వారిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## జనగణనలో స్వీయ నమోదు విధానం సులభతరం

### తాసిల్దార్ శ్రీనివాసులు




**తంబళ్లపల్లె ఏప్రిల్ 16 ప్రభాతవార్త ః**

20 27 జనగణన స్వీయ నమోదు కార్యక్రమం ద్వారా ఓటర్ నమోదు విధానం సులభతరమని తాసిల్దార్ శ్రీనివాసులు సూచించారు. గురువారం తంబళ్లపల్లె జూ నియర్ కళాశాలలో జన గణన పై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మార్గద ర్శకాల ప్రకారం నేటి నుండి 30వ తేదీ వరకు 15 రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ జాతీయ జనగణన స్వీయ నమోదు పై అధికారులు పారదర్శకంగా పని చేయాలని సూచనలు చేశారు. 15 రోజులు పాటు విభిన్న వర్గాలను లక్ష్యంగా చేసుకొని ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిం చాలని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాలు, కార్మికులు, వృద్ధులు అన్ని వర్గాల పై దృష్టి సారిస్తూ అవగాహన ప్రచా రం జోరు పెంచాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ 20 27 జనగణన స్వీయ నమోదు తో పాటు సర్వే నిర్వహణపై అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు

**రాయచోటి ఏప్రిల్ 16 ప్రభాతవార్త ః**

నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధి పాటిగుంట్ల రవి నాయుడు ఒక ప్రకటనలో తెలియచేశారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్ ఉన్నత స్థాయి విద్యావకాశాల గురించి నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జేఈఈ మరియు నీట్ ప్రవేశ పరీక్షల శిక్షణలో అనుభవం కలిగిన అధ్యాపకులచే అవగాహన సదస్సు ఏప్రిల్ 18వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు రాయచోటి మదనపల్లి రోడ్డు లోని పిసిఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేయబడిందని ఆయన తెలియజేశారు. ఈ అవకాశాన్ని రాయచోటి మరియు పరిసర ప్రాంత విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవలసిందిగా కోరారు.

## మహిళల వార్షిక జీవనోపాదుల ప్రణాళికతో ముందడుగు

### జిల్లా డిపిఎం సత్యనారాయణ



**తంబళ్లపల్లె ఏప్రిల్ 16 ప్రభాకర్ ః**

తంబళ్లపల్లె నియోజకవర్గం లోని మహిళా సంఘాలు వార్షిక జీవనోపాదుల ప్రణాళికతో అభివృద్ధిపై ముందడుగు వేయడానికి సహకరించాలని సెర్ప్ డిపిఎం సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం ఐకెపి కార్యాలయంలో ఏపీఎం గంగాధర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఏపీఎంలు, సీసీలు, ఎంఎస్ఓపిల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డిపిఎం సత్యనారాయణ మాట్లాడుతూ మహిళా సంఘాలు పొందిన రుణాలు ముందస్తు వార్షిక ప్రణాళికతో ఆర్థిక అభివృద్ధి కి విభిన్న వ్యాపారాలు, కోళ్ల పరిశ్రమ, చేపల పెంపకం, మినీ పరిశ్రమలు, ప్రకృతి వ్యవసాయ పంటలు, పలు రకాల లాభదాయక వ్యాపారాల పై దృష్టి సారించాలని సూచించారు. మహిళా సంఘాలు విభిన్న వ్యాపారాలతో ఆర్థిక అభివృద్ధి తో పాటు వ్యాపార మెలకువలు అలవర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఐకెపి అధికార యంత్రాంగం మహిళా సంఘాల వార్షిక జీవనోపాదులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి భవిష్యత్తు లో మహిళా సంఘాల బలోపేతం తో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా వారిలో చైతన్యం నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపిఎంలు రమణ, సుబ్రహ్మణ్యం, ఏజీఎం సంతోష్ కుమార్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్లు ప్రవీణ్ కుమార్, నాగరాజు, ఆరు మండలాల ఏపీఎంలు, సీసీలు, ఎంఎస్ఓపిలు పాల్గొన్నారు.

## భక్తులతో నిండిన షిర్డీసాయిబాబా ఆలయం



విశేషాలంకరణలో షిర్డీ సాయిబాబా

**చౌడేపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులతో నిండిపోయింది. ఆలయ ప్రధానార్చకుడు పృద్వీనవీన్ ఉదయాన్నే స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. అంతే కాకుండా భక్తులచే బాబాకు క్షీరాభిషేకం జరిగింది. సా ్వమివారికి అభిషేకం చేయించడానికి భక్తులు ఎగబడ్డారు. బాబావారి కీర్తలనతో ఆలయం మార్మోగింది.

## వడదెబ్బ నివారణపై సూచనలు



తొండూరు ఏప్రిల్ 16 ప్రభాతవార్త:
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొండూరు యందు డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో అంబేద్కర్ గురుకులం విద్యార్థినులకు (14 సంవత్సరాల) కలిగినవారికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కొరకు (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్ 40 మంది విద్యార్థినులకు వేశారు, ఇప్పటివరకు 120 మందికి ఈ వ్యాక్సిన్ అందించడం విశేషం. గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ లక్షణాలు, నివారణ మార్గాల గురించి డాక్టర్ అవగాహన కలిగించారు. అలాగే విద్యార్థినులతో వడ దెబ్బ నివారణ చర్యలు. వీళిళీ ద్రావణం యొక్క ప్రాధాన్యత, తయారు చేయువిధానం గురించి వడదెబ్బ సోకిన తర్వాత తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డాక్టర్ గవాస్కర్ రెడ్డి తెలియచేశారు. ఈ కార్యక్రమాలలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, డిప్యూటీ హెచ్ ఈఓ మల్లయ్య, ఆరోగ్య కార్యకర్తలు సుబ్బలక్షుమ్మ,నాగేశ్వరీ, సుజాత, గురుకులం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైల్వే కేంద్ర సమస్యలపై వినతి

నందలూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:



నందలూరు రైల్వే కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు రాచూరి మురళి అధికారులను కోరారు. ఈ మేరకు సీనియర్ డిఈఎన్ కోఆర్డినేషన్ జి.బి.ఎస్ శ్రీనివాస్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జ్‌లో లోపాలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా నీటి లీకేజీ సమస్య, దెబ్బతిన్న ఫ్లోరింగ్ కారణంగా పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫుట్‌పాత్ సౌకర్యం లేకుండానే లెవెల్ క్రాసింగ్ గేట్ మూసివేయడం వల్ల పాదాచారులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నందలూరు రైల్వే స్టేషన్‌లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజీ కల్పించాలని, తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు స్థానిక రిజర్వేషన్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. సమస్యలను సానుకూలంగా స్వీకరించిన అధికారులు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు రాచూరి మురళి తెలిపారు.

## యుద్ధం ఎవరి కోసం అనే అంశంపై 19న సదస్సు

**ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడి పూర్వాపరాలపై చర్చ**



ప్రొద్దుటూరు ఏప్రిల్ 16 ప్రభాతవార్త
అమెరికా ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ తదితర దేశాలపై సాగిస్తున్న యుద్ధం ఎవరి ప్రయోజనాల కోసం సాగుతున్నది... దీని వెనుక ఉన్న రాజకీయాలు ఏమిటి? ఎవరి ఆధిపత్యాల కోసం, ఎవరి లాభాల కోసం ప్రపంచమంతా శిధిలాలను బూడిద కుప్పలుగా మిగిలిస్తున్నారనే విషయాలపై యుద్ధ వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో యుద్ధం ఎవరికోసమని అనే అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు యుద్ధ వ్యతిరేక వేదిక కన్వీనర్ లెక్చరర్ సురేష్ బాబు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక జెవివి కార్యాలయంలో యుద్ధం ఎవరి కోసం అనే అంశంపై నిర్వహించే సదస్సు కరపత్రాలను వేదిక సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 19ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పద్మశాలి కళ్యాణమండపంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఇరాన్పై యుద్ధం పశ్చిమాసియా కల్లోలం చారిత్రక రాజకీయ ఆర్థిక కారణాలు అనే అంశంపై బుడ్డిగా జమీందార్, ఆల్ ఇండియా ప్రోగ్రెస్ ఫోరం నాయకులు, ఇరాన్ పై యుద్ధం భారతదేశ అలిగిన విధానం డాక్టర్ ఏం తులసి రెడ్డిమాజీ రాజ్యసభ సభ్యులు ,ఇరాన్ పై యుద్ధం ప్రపంచ దేశాలపై ప్రభావం మానవ హక్కులు క్రాంతి చైతన్య పౌర హక్కుల సంఘం, యుద్ధం శాంతి కేయం అబ్దుల్ సుభాన్ ,ఎంపీ జే పసిమాసియా కల్లోలంలో మతం పాత్ర జి చంద్రశేఖర్ సిపిఎం జిల్లా కార్యదర్శి తదితరులు అంశాలపై ప్రసంగిస్తారన్నారు ఈ కార్యక్రమంలో విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి సిపిఐ కార్యవర్గ సభ్యుడు రామయ్య చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ , ఎంపీజే సలీం, అయూబ్ ఖాన్,ఎస్ టి యు మాజీ నేత రషీద్ ఖాన్, జె వి విరాష్ట్ర కార్యదర్శి తవ్వ సురేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్, జమాతే ఇస్లాం హింద్ రెహానా, వ్యవసాయ కార్మిక సంఘం శేఖర్ డేవిడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కాలేయ దేవానంద్, రాయలసీమ విద్యా వంతుల వేదిక మహమూద్, మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, జాతీయ జనవిజ్ఞాన వేదిక పలువులు రమణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

**నిరుద్యోగ యువతకు అండగా వినూత్న నిర్ణయం**

**పోటీ పరీక్షల అభ్యర్థులకు విలువైన గ్రంథాల బహుకరణ**

**జాబ్ క్యాలెండర్ నేపథ్యంలో విద్యార్థులకు ప్రోత్సాహం**

పులివెందుల, ఏప్రిల్ 16, ప్రభాత వార్త :
నిరుద్యోగ యువత ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అండగా నిలవాలనే సంకల్పంతో శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగాల క్యాలెండర్‌ను దృష్టిలో ఉంచుకుని, అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను తన సొంత నిధులతో పులివెందుల ప్రభుత్వ గ్రంథాలయా నికి బహుకరించారు. ఈ సందర్భంగా గురువారం పులివెందుల గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సతీమణి శ్రీమతి భూమిరెడ్డి ఉమాదేవి పాల్గొని, పుస్తకాలను కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీ దాసరి భానుప్రకాష్ కి అందజేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రూప్1, గ్రూప్2 వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు, న్యాయశాస్త్రానికి సంబంధించిన పుస్తకాలు, అలాగే జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా శ్రీమతి ఉమాదేవి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన పుస్తకాలను కొనలేని విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు. కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్ దాసరి భానుప్రకాష్ మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి ఎమ్మెల్సీ అందిస్తున్న సహకారం అభినందనీ యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.



పుస్తకాలతో ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి, గ్రంథాలయ చైర్మన్ భాను ప్రకాష్

ఇంటర్ ఫలితాలలో డా.బి జె యస్ ఆర్, సుభాష్ గాయత్రి

## జూనియర్ కళాశాలల విద్యార్థుల మార్కుల జోరు

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త
రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన ఇంటర్మీడియేట్ ఫలితాలలో బద్వేల్ పట్టణం లోని డా బి జెయస్.ఆర్. మరియు సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల విద్యార్థులు జూనియర్ ఇంటర్ ఎంపీసీ. విభాగం లో బిజివేముల జాహ్నవి 461/470, మన్యం స్వర్ణకళ 459/470, వ్యాపారాల శ్రీవిద్య 459/470 ,ఇ.బాలాజీ 458/470, సంద సూర్యచరణ్ 457/470, నేలటూరి మల్లేశ్వరి 457/470, పోలు చర్ల సాహిత్య 455/470, ఎస్.జాహ్నవి 454/470, బి.వర్షిత 453/470 ఏ.లక్ష్మీ ప్రణీత 453/470 బి.పుష్పలత 452/470 బి.పావని 452/470 సి.వి మహేష్ కుమార్ 451/470, కె.శ్రావణి 451/470 కె.నవీన 450/470 మార్కులు సాధించారు. ఇంకా బై.పి. సి విభాగంలో బి. దోసిని 435/455,ఆర్ వెంకట సురేంద్ర 426/455, సయ్యద్ జహీదా తబుస్సుమ్ 423/455, పి లక్ష్మీ పవిత్ర 418/455, బి మానస 404/455 మార్కులు సాధించారు. సీ.ఈ.సీ విభాగంలో బీరం సాయి దీప 467/500, కె.శ్రీ హర్షిత 429/500, ఎస్. సుభాన్ బి 426/500, వై .శివ మహేశ్వరి 405/500. మార్కులు సాధించి టౌన్ టాప్ గా నిలిచారు. సీనియర్ ఇంటర్ ఫలితాలలో బైపిసి విభాగము నందు సరిటాల అయేషా సుల్తానా 981 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ గా నిలిచింది. ఇంకా ఎంపీసీ విభాగంలో బి.జాహ్నవి 987, పి.ధన్వి 981, ఎన్.సుదీక్షిత్ 981, ఆర్. విజయ్ చంద్ర 979 కె.చంద్రమోళిక 979 బి.గుణ వర్షిని 977 పి.వెంకట కౌశిక 972 మార్కులు సాధించి టౌన్ టాప్ గా నిలిచారు. వీరిని డా . బి.జె. యస్.ఆర్. జూనియర్ కాలేజ్ మరియు సుభాష్ గాయత్రి జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ మరియు అధ్యాపకులు అభినందించారు, ఇంతటి విజయానికి కారణమైన విద్యార్థులను అధ్యాపకులను యాజమాన్యం అభినందించారు.



## నాటక రంగ దినోత్సవం సందర్భంగా కళాకారులకు సన్మానం

రాజంపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త
నాటకంగా దినోత్స వ సందర్భంగా రాజంపేటలో సీనియర్ కళాకారులకు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక జీఎంసి క్లబ్లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ చారిత్రాత్మక నటుడు అల్లూరి సీతా రామ రాజు నాటకం లో పిల్లే పాత్ర ఫేమ్ గునకల సుబ్బరాయుడు ,పౌరాణిక నటుడు హరిచ్చంద్ర పాత్రకు వన్నె తెచ్చిన నటుడు ఆర్. బి. వి. సుబ్బారెడ్డి, సీనియర్ న్యాయవాది, రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత సింగంశెట్టి కృష్ణ కుమార్ లను సంగరాజు రామ చంద్ర రాజు సహకారం తో ఘనంగా సన్మానించారు. ఒకప్పటి కళలకు కాణాచి అయిన రాజంపేట లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారాచంద్రబాబు నాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వ సహకారం తో ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మించి చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి రాజంపేటకు పేరు తెస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, రాయలసీమ కళా పీఠం అధ్యక్షుడు అయిన తరిగోపుల లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమం లో లయన్ సయ్యద్ నాసరుద్దీన్,డాక్టర్ నవీన్ కుమార్ , పెనిగలపాటి చంద్ర



సన్మానం అందుకున్న గుణకల సుబ్బరాయుడు, కృష్ణ కుమార్, సుబ్బారెడ్డి

నాయుడు. పీరం వెంకట సుబ్బయ్య నాయుడు,బుక్కే రాజశేఖర్ నాయక్, మద్దిపట్ల రామకృష్ణ నాయుడు, విశ్రాంత న్యాయమూర్తి పలుకూరి రామాంజనేయులు, కందుల వెంకట రమణ, తెలుగుదేశం నాయకులు సంజీవ రావు, వెంకటేశ్వర్లు నాయుడు, సుధాకర్ .కౌన్సిల్ రాఘవ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



వైద్య శిబిరానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణుడు

తెలుసుకున్నారు. ముఖ్య వైద్యుడు డాక్టర్ సురేంద్ర ఆధ్వర్యంలో నిపుణులు పేదలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో లోకేష్ బాబు సూచనల మేరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. త్వరలో ఇదేవిధంగా సుండుపల్లె,వీరబల్లె,నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, ప్రాంతాలలో కూడా వైద్య శిబిరాలు ప్రత్యేకంగా నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలతో పాటు,రవాణాభోజన వసతి కూడా కల్పించారు. వైద్య శిబిరంలో రేడియంట్ ఫౌండేషన్ టీమ్ సభ్యులు రోగులకు సేవలు అందించినందుకు చమర్తి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, డాక్టర్ నవీన్, పార్టీ గ్రామీణ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్, పట్టణ కార్యదర్శి అడపాల శ్రీనివాసులు, పాండురాజు, రాంనగర్ నరసింహ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల్లో ప్రమాదాలపై అవగాహన





మైదుకూరు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:
అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు మైదుకూరు ఫైర్ ఆఫీసర్ ఎస్.అన్వర్ భాష ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది బద్వేల్ రోడ్డు అగ్నిమాపక కేంద్రం నుండి కరపత్రములు పంచుతూ విలియమ్స్ నగర్ చేరుకొని అక్కడ ఉన్న ప్రజలకు కరపత్రాలు పంచి ఎల్పిజి గ్యాస్, ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదంలో జరిగినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు, మంటలు ఆర్పే సమయంలో సూచనలు చెప్పి వాటి పైన అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమం నందు ప్రజలు అగ్రిమాపక సిబ్బంది సత్యరాజు, వీరభద్రారెడ్డి, పవన్, లింగమయ్య, గౌస్, సతీష్ మోహన్, శ్రీనివాసులు రెడ్డి, క్రిష్ణ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరు కావడం జరిగింది.

## ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి ప్రజల జాగ్రత్తగా ఉండాలి





ఒంటిమిట్ట ఏప్రిల్.16.ప్రభాతవార్త
వేసవి కాలం కావడంవల్ల మండలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని కావున మండల ప్రజలందరూ అత్యంత జాగ్రత్తలు వహించాలని గురువారం మండల కేంద్రమైన ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ భావన, అరుణ జ్యోతిలు ప్రజలకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండాకాలం కావడం చేత రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని ఈ తరుణంలో ఒంటిమిట్ట మండలంలో 14వ తేదీ 45 డిగ్రీల ఉష్ణోగ్రత చేరుకుందన్నారు. వాతావరణ పరిస్థితిని బట్టి ఒంటిమిట్ట మండలంలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని మండల ప్రజలందరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసరమై ఉదయం 10 :00 గంటల వరకు బయట సంచరించాలని సాయంత్రం 5:00 గంటల వరకు తమ ఇండ్లలోనే ఉండాలన్నారు. చల్లని పానీయాలు, జ్యూసులు, మజ్జిగ, పండ్లు, కర్బుజ కాయ, కీరకాయ తరచుగా తింటూ ఉండాలన్నారు. శరీరానికి చలవరం కలుగుతుందన్నారు. కూలి పనులకు గాని పొలం పనులకు గాని వెళ్లేవాళ్లు ఉదయం 10:00 గంటల వంకు పనులు చేయాలన్నారు. పనులు చేసే సమయంలో కచ్చితంగా నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలని, తలపాగా గాని టోపీ గాని ధరించాలని, చెప్పులు కచ్చితంగా వేసుకోవాలన్నారు. భోజనం చేసేటప్పుడు చేతులు కాళ్లు కచ్చితంగా కడుక్కోవాలన్నారు. చిన్నపిల్లలు, బడి ఈడు పిల్లలు, గర్భవతులు ఉదయం 10 :00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు తమ ఇండ్లలో ఉండాలన్నారు. సన్నని పలుచని బట్టలు ధరించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటికి వెళ్లవలసి వస్తే గొడుగు గాని టోపీ గాని ధరించి వెళ్లాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పదార్థాలపై మూతలు పెట్టుకోవాలన్నారు. మండల పంచాయతీలోని ఆశా వర్కర్ల వద్ద, ఆరోగ్య సిబ్బంది వద్ద ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని కావున వాటిని వినియోగించుకోవాలని మండల ప్రజలకు ఆరోగ్య విషయాలపై సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.

## పరీక్ష ఫలితాల్లో వేంపల్లి నారాయణ కళాశాల విద్యార్థులు విజయ డంకా

వేంపల్లె ఏప్రిల్ 16 (ప్రభాత వార్త)
బుధవారం విడుదలైన ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాలలో వేంపల్లి నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఘన విజయాలు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టె నారాయణ రెడ్డి తెలిపారు. సెకండ్ ఇయర్ కు చెందిన కొట్టె రెడ్డి శ్వేత 977/ 1000 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం మరియు ఫస్ట్ ఇయర్ యం.పి.సి కి చెందిన డి. ప్రభావతి 441/470 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానం పొందారు. అలాగే కళాశాల ఉత్తీర్ణత మొదటి సంవత్సరం 93శాతం, ద్వితీయ సంవత్సరం 90 శాతం ఫలితాలు సాధించారు. ఈ ఫలితాల పట్ల నారాయణ విద్యా సంస్థల అధినేత కొట్టె నారాయణ రెడ్డి మరియు ప్రిన్సిపల్ విజయ్ కుమార్ లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొట్టె నారాయణ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో పాటు నిరంతర శ్రమ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయి ఫలితాలు సాధించేందుకు నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం కట్టుబడి ఉందని తెలిపారు.





### కలెక్టర్ గారు...

## ఆదర్శ పంచాయతీగా మార్చండి..



వేంపల్లె ఏప్రిల్ 16 ప్రభాతవార్త
గ్రామ పంచాయతీ పాలన గాడి తప్పిందని టిడిపి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని, పంచాయతీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చేసేందుకు చెక్ పవర్ లేక పోవడంతో వేసవిలో తాగునీటి, పారిశుద్య సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. జిల్లా అధికారులు స్పెషల్ అధికారులను నియమించిన జాడ లేని స్పెషల్ అధికారుల పాలనగా వేంపల్లె పంచాయతీ కొనసాగుతున్నదని చెప్పారు. రెండు సంవత్సరాల నుండి పంచాయతీకి సరైన అధికారి నియమించిక పోవడం చాలా దారుణం అన్నారు. అధికారికి చెక్ పవర్ ఇవ్వక పోవడం వలన అభివృద్ధికి ఆటకం కలుగుతున్నదని తెలిపారు. ఒకసారి జిల్లా కలెక్టర్ వేంపల్లె గ్రామ పంచాయతీపై ఆలోచించాలని కోరారు. సరైన అధికారికి చెక్ పవర్ ఇవ్వక పోవడం వలన సమస్యలు తలెత్తుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేసేందుకు నిధులు ఖర్చు చేసేందుకు చెక్ పవర్ ఇవ్వాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి టిఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు యాసిన్, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.

## శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యలపై ఖండన..

**జనసేన పార్టీ నేత డా. దాసరి రవిశంకర్**

వేంపల్లె ఏప్రిల్ 16 (ప్రభాత వార్త)



మంగళగిరిలో బీసీపై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ నిర్వహించిన సభలో తెలంగాణకు చెందిన శ్రీనివాస్ యాదవ్ జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నేత డా. దాసరి రవిశంకర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్థం లేకుండా మాట్లాడటం, కులం పేరును ఉపయోగించడం సమంజసం కాదని ఆయన అన్నారు. బీసీల గురించి మాట్లాడే అర్హత శ్రీనివాస్ యాదవ్‌కు లేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్ర కాలంలో ప్రజారాజ్యం పార్టీ తరపున బీసీలకు 100కు పైగా స్థానాలు కేటాయించేందుకు ముఖ్య కారణం తమ అధినేత పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు. ఎవరైనా పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని శ్రీనివాస్ యాదవ్‌కు దాసరి రవిశంకర్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నారాయణ రెడ్డి, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ వీధి నాటకాలు ఆపాలి

**చిత్తశుద్ధితో అభివృద్ధి చేయాలి**

**ఎన్నికలు దగ్గరపడు తుండటంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు**

**వైసీపీ నాయకులు ఆరోపణలు**



పులివెందుల, ఏప్రిల్ 16 , ప్రభాత వార్త :
పట్టణంలో టీడీపీ నాయకులు వీధి నాటకాలు ఆపి చిత్తశుద్ధితో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పులివెందుల ప్రాంతానికి గణనీయమైన అభివృద్ధికి నిధులు రాలేదని వారు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొంతమంది టీడీపీ నాయకులు స్వల్ప స్థాయి మరమ్మత్తులు చేస్తూ పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతున్నట్లు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు సిమెంట్ బస్తాలతో పనులు చేస్తూ ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో లేకున్నా గౌరవ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సహకారంతో, ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో కోట్ల రూపాయల ఎంపీ నిధులతో పట్టణంలో సీసీ రోడ్లు నిర్మించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా స్వంత నిధులతో వీధిదీపాలు ఏర్పాటు చేయడం, మ్యాన్ హోల్స్ నిర్మాణం వంటి పనులు కొనసాగుతున్నా యని వివరించారు. ఇకనైనా టీడీపీ నాయకులు రాజకీయ డ్రామాలు మానుకుని నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పాడా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు చంద్రమోళి, వైసీపీ నాయకులు తోటంశెట్టి హరి, ఖలంధర్ పాల్గొన్నారు.

## రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే తాట తీస్తాం



ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:
ప్రొద్దుటూరు రూరల్ ఎస్సై శ్రీకాంత్ రౌడీ షీటర్లను సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు. జిల్లాఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఏఎస్పీ విభూకృష్ణ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు గురువారం ప్రొద్దుటూరు రూరల్ పీఎస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ నేర ప్రవృత్తిని విడిచి సమాజంలో మంచి నడవడికతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే తాట తీస్తామన్నారు. గొడవలు, దౌర్జన్యాలు, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రవర్తనలో మార్పు లేకపోతే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## నేడు అధికారులతో సమావేశం

బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 16 ప్రభాతవార్త
జగద్గురు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గురు పూజ ఆరాధన మహోత్సవాలు పైన శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎంపీడీవో కార్యాలయం నందు మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు బి.మఠం తాసిల్దార్ కార్తీక్ తెలియజేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా తీసుకోవలసిన జాగ్రత్తలు, సౌకర్యాలపై ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సమావేశానికి బద్వేల్ రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రమోహన్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని, కావున అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జాన్సన్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.